క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి



సమావేశంలో కలెక్టర్, అడిషనల్ కలెక్టర్

పెద్దపల్లిరూరల్: రైతులు పండించిన ధాన్యం దిగుబడులను మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. బుధవారం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి వీడియో కాన్ఫరెన్సులో పాల్గొని జిల్లా అధికారులకు సూచనలు చేశారు. కేంద్రాలకు ధాన్యం తెచ్చిన రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని ఆదేశించారు.

కేంద్రాలను ప్రారంభించాలి..

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముందుగానే ప్రారంభించాలని, వచ్చిన నాణ్యమైన ధాన్యాన్ని తూకం వేసి 24గంటల్లోగా మిల్లుకు తరలించేలా చూడాలని కలెక్టర్ శ్రీహర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధికారులు కాళిందిని, డీఏవో శ్రీనివాస్, డీఎస్‌వో శ్రీనాథ్, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి ఉన్నారు.

మరుగుదొడ్లకు నీటి సౌకర్యం



సాక్షి ఎఫెక్ట్..

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 22వ డివిజన్ గౌతమినగర్ వారసంతలో మరుగుదొడ్లు నిర్మించి నీటి సౌకర్యం కల్పించలేదు. దీనిపై అక్టోబర్ 8న 'సాక్షి'లో 'నిర్మించారు.. నీటి కనెక్షన్ మరిచారు' అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ అరుణశ్రీ సంబంధిత విభాగం అధికారులకు మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. కాగా బుధవారం వారసంతలోని మరుగుదొడ్లకు నీటి సౌకర్యం కల్పించారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన 'సాక్షి'కి వారసంత వ్యాపారస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ఉపకేంద్రం స్థల పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న ఏఈ సంతోష్‌రెడ్డి

ముత్తారం: మండలంలోని పారుపల్లి పంచాయతీ మానేరు అవతల శాత్రాజ్‌పల్లి గిరిజన గ్రామంలో విద్యుత్ ఉప కేంద్రం నిర్మాణం కోసం బుధవారం ట్రాన్స్‌కో ఏఈ సంతోష్‌రెడ్డి స్థల పరిశీలన చేశారు. శాత్రాజ్‌పల్లి మానేరు ప్రాంత వ్యవసాయ రైతులకు విద్యుత్ ఆటంకం కలుగుతోంది. దీని నివారణకు సబ్‌స్టేషన్ మంజూరు చేయాలని మాజీ జెడ్పీటీసీ నాగినేని జగన్‌మోహన్ వినతిమేరకు మంత్రి శ్రీధర్‌బాబు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.3.30కోట్ల నిధులు మంజూరు చేశారు. కాగా ట్రాన్స్‌కో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు ఏఈ స్థల పరిశీలన చేశారు. త్వరలో నిర్మాణ పనులు చేపడతామని ఏఈ పేర్కొన్నారు. కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బుచ్చాంరావు ఉన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రానివ్వం



నల్లానీటిని పరిశీలిస్తున్న కమిషనర్ రమేశ్

పెద్దపల్లి: ప్రజలకు తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూస్తామని మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేశ్ అన్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో నల్లాల ద్వారా సరఫరా అవుతున్న మంచినీటిని బుధవారం ఆయన పరిశీలించారు.

కల్వచర్లలో చోరీ

రామగిరి: మండలంలోని కల్వచర్లలో సామిత్రి లావణ్యకు చెందిన పాత గృహంలో చోరీ జరిగింది. పురాతన ఇత్తడి సామగ్రి ఎత్తుకెళ్లారని బాధితురాలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కాగా ఎస్సైలు తాడవేని శ్రీనివాస్, పురుషోత్తం దివ్య సంఘటన స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ బృందం తనిఖీలు చేపట్టారు.

వీధిదీపాలు లేక ప్రయాణికుల ఇబ్బంది



రాఘవాపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారి

పాలకుర్తి: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలో రాఘవాపురం రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిపై వీధిదీపాలు లేకపోవడంతో స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. రాఘవాపురం రైల్వేస్టేషన్‌లో భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్, కాజీపేట ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతున్నాయి. ఇవి రెండు రైళ్లు కూడా తెల్లవారుజామున కాజీపేట వైపు, రాత్రివేళ కాగజ్‌నగర్ వైపు వెళ్తాయి. ఈ రైళ్ల కోసం వచ్చే ప్రయాణికులు ధర్మారం క్రాస్‌రోడ్డు వద్ద దిగి స్టేషన్‌కు వెళ్లాల్సి ఉంటుంది. దాదాపు అరకిలోమీటరు దూరం కలిగిన ఈ రోడ్డుపై వీధిదీపాలు లేవు. అలాగే రహదారి కూడా గుంతలమయమై, కంకరరాళ్లు తేలి ఉండటంతో స్టేషన్‌కు వచ్చి, వెళ్లే ప్రయాణికులు చీకట్లో అవస్థలు పడుతున్నారు. అధికారులు రోడ్డుపై గుంతలు పూడ్చి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

అంగన్వాడీ కొత్త భవనాల నిర్మాణానికి కృషి



చీరలు పంపిణీ ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు: ప్రతీ గ్రామంలో అంగన్వాడీ సెంటర్లకు కొత్త భవనాల కోసం కృషి చేస్తానని పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని శివపల్లిలోని ఎమ్మెల్యే గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒకే మోడల్‌లో కొత్త భవనాలు నిర్మించాలని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని 305 అంగన్వాడీ సెంటర్లకు సంబంధించి టీచర్లకు, ఆయాలకు కొత్తగా డ్రెస్ కోడ్ చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, సీడీపీవో, అంగన్వాడీలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జూలపల్లి: మండలంలోని రెండు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో పలువురు మృతి చెందారు. బాధిత కుటుంబాలను బుధవారం ఎమ్మెల్యే విజయరమణారావు పరామర్శించారు. కోనరావుపేటలో మడిపెల్లి చంద్రయ్య, జూలపల్లిలో మైనార్టీ నాయకులు ఎండీ ఫకీర్ మహ్మద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా వారి కుటుంబాలను పరామర్శించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొజ్జ శ్రీనివాస్, పార్టీ సీనియర్ నాయకులు లోక జల్పతిరెడ్డి, పొట్యాల శంకరయ్య, లింగయ్య, పెసరు లచ్చయ్య, మైనార్టీ నాయకులు గౌస్ పాషా, నన్నె సాహెబ్, ఖాజా ఉన్నారు.

'కొట్టె'కు సత్కారం



సత్కరిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి రిక్రియేషన్ క్లబ్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించి ప్రధాన కార్యదర్శిగా నాలుగోసారి ఎన్నికైన కొట్టె సదానందంను బుధవారం ఎమ్మెల్యే విజయరమణారావు సత్కరించారు. క్యాంపు కార్యాలయంలో సదానందం ఎమ్మెల్యేను కలిశారు.

క్షేత్రస్థాయిలో వరిపొలాల సందర్శన



నూతన వంగడాలను ప్రదర్శిస్తున్న శాస్త్రవేత్త సతీశ్‌చంద్ర

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, ఆకెనపల్లి, ఎగ్లాస్‌పూర్ గ్రామాల్లోని వరిపొలాలను బుధవారం కూనారం వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త సతీశ్‌చంద్ర క్షేత్రస్థాయిలో పర్యటించారు. వరికి సోకిన తెగుళ్లను గుర్తించి రైతులు చేపట్టాల్సిన నివారణ చర్యలను వివరించారు. వరిలో కంకినల్లి నివారణకు స్పైరోమెసిఫిన్ మందును ఎకరానికి 150 మి.లీ పిచికారీ చేయాలన్నారు. కూనారం వ్యవసాయ పరిశోధన క్షేత్రంలో తయారుచేసిన వరి వంగడాలను ఇతర రైతులు సాగు చేసే దిశగా ప్రోత్సహించాలని కోరుతూ 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' పేరుతో క్షేత్ర ప్రచారం చేపట్టారు. క్షేత్ర సందర్శనలో అంతర్గాం మండల వ్యవసాయాధికారి సతీశ్, ఏఈవోలు హరీశ్, రమేశ్, రైతులు తిరుపతి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• స్లాట్ బుకింగ్ పద్ధతిలో పత్తి కొనుగోళ్లు

కమాన్‌పూర్: పత్తి సాగు చేసిన రైతులు విక్రయించుకునేందుకు ముదుగా స్లాట్ బుక్ చేసుకోవాలని కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ వైనాల రాజు సూచించారు. మండల కేంద్రంలోని ఏఎంసీ కార్యాలయంలో బుధవారం చైర్మన్ మాట్లాడారు. పత్తి విక్రయించే రైతులు ముందుగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కాపాస్ యాప్ డౌన్ లోడ్ చేసుకోవాలన్నారు. ఏ జిన్నింగ్ మిల్లులో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని అనుకుంటే ఆరోజు తేదీ, సమయం కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. పత్తి రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఎంపీడీవో లలిత ఉన్నారు.

• మున్నూరుకాపు సంఘం లక్కారం అధ్యక్షుడిగా దశరథం

ముత్తారం: మండలంలోని లక్కారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా దశరథం ఎన్నికయ్యాడు. ఆ సంఘం ఉపాధ్యక్షుడిగా అగ్గు ప్రశాంత్, కోశాధికారి బర్ల సదానందం, ప్రధాన కార్యదర్శి బర్ల సంతోష్, సహాయ కార్యదర్శులు బర్ల బుచ్చయ్య, బర్ల రాజు, కమిటీ ముఖ్య సభ్యులుగా బర్ల శ్రీనివాస్, దశరథం, సాయికృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

• 18న బంద్ విజయవంతం చేయాలి

ధర్మారం: బీసీ రిజర్వేషన్లను అడ్డుకున్నందుకు నిరసనగా 18న తలపెట్టిన రాష్ట్రబంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంగ మహేందర్‌యాదవ్ కోరారు. ధర్మారంలో ఆయన బుధవారం మాట్లాడారు. బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఎంపీ ఆర్.కృష్ణయ్య నాయకత్వంలో నిర్వహిస్తున్న బంద్‌లో పాల్గొనాలని కోరారు. రాజకీయాలకతీతంగా నిరసనలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

• విజేతలకు బహుమతి

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణ కాలనీ దుర్గయ్యపల్లె ప్రభుత్వ పాఠశాలలో కలాం జయంతి సందర్భంగా సమతా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులు అందించారు. సమతా ఫౌండేషన్ చైర్మన్ దుర్గం నగేష్, సమతా గ్రంథాలయం చైర్మన్ ప్రమీల, హెచ్‌ఎం రేణుక పాల్గొన్నారు.

• రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

సుల్తానాబాద్‌రూరల్: మండలంలోని కాట్నపల్లి గ్రామపరిధిలోని రాజీవ్ రహదారిపై బుధవారం పట్టణంలోని మార్కండేయకాలనికి చెందిన లక్ష్మీనరసింహచారి బైక్ అదుపు తప్పి కింద పడగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు వివరాల ప్రకారం.. లక్ష్మీనరసింహచారి బైక్‌పై కరీంనగర్‌కు పని నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్నాడు. కాట్నపల్లి దాబా ఎదురుగా రోడ్డుపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనగా తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

• కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు మేలు

పెద్దపల్లిరూరల్: కాంగ్రెస్ పాలనతోనే ప్రజలకు మేలు జరుగుతోందని పార్టీ నాయకులు మందల సత్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, బుర్ర తిరుపతి, గుజ్జుల కుమార్ అన్నారు. పెద్దపల్లిలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. ప్రజలకిచ్చిన ఆరుగ్యారంటీలతో పాటు ఇంకా ఎన్నో పథకాలను అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. నాయకులు పెంచాల మల్లయ్య, వెంకటేశ్, అంజయ్య ఉన్నారు.

• రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు

ఓదెల: మండలంలోని 22 గ్రామాల్లోని రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కఠిన చర్యలు తప్పవని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ అన్నారు. పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఎస్సై మాట్లాడారు. రోడ్లపై ధాన్యం ఆరబోసిన స్థలంలో ఎలాంటి ప్రమాదాలు జరిగినా అట్టి వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

• రామగుండం ప్రతినిధులకు హైదరాబాద్‌లో బాధ్యతలు

రామగుండం: హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో భాగంగా రామగుండం బీఆర్‌ఎస్ ముఖ్య ప్రతినిధులకు జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో పలు డివిజన్లకు ఇన్‌చార్జీలుగా నియమించినట్లు బుధవారం బీఆర్‌ఎస్ రామగుండం పట్టణ ఇన్‌చార్జి బొడ్డుపల్లి శ్రీనివాస్ తెలిపారు. రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ పరిధిలోని 224, 225, 226వ ఎలక్షన్ బూత్‌లు, ఎల్బీనగర్‌లకు ఇన్‌చార్జీలుగా నియమించారన్నారు. నియమించిన వారిలో మెతుకు దేవరాజ్, బొడ్డు రవీందర్ తదితరులు ఉన్నారు.

• సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

ధర్మారం: విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన చదువు నేర్చుకోవాలని సోషల్ మీడియా, ఫోన్లకు దూరంగా ఉండాలని మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెలిస్టు సుచరిత సూచించారు. మండలంలోని మల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యాలయంలో బుధవారం అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు.

• మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలి

రామగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించాలని రామగిరి ఖిల్లా కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త ఎ.శ్రీనివాస్ ఆకాంక్షించారు. మండలంలోని లొంకకేసారంలో బుధవారం అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం నిర్వహించారు. మహిళా రైతులు స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించడానికి వివిధ శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని, మాంసం ఉత్పత్తుల తయారీపై హైదరాబాద్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు నవ్య, వినోద్‌కుమార్, ఏపీఎం పద్మ, సీసీ శ్రీధర్, సీఏ సునీత, మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ ప్రభావిత, పునరావాస ప్రాంతాల అభివృద్ధికి నిధులు కేటాయించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ సూచించారు. స్థానిక జ్యోతిభవన్‌లో ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారులతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. రోడ్లు, డ్రైన్లు, వీధిదీపాలు తదితర అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఎన్టీపీసీ హెచ్‌ఆర్ అధికారి ప్రవీణ్ కె.చౌదరి, కాంగ్రెస్ పట్టణ కమిటీ అధ్యక్షుడు ఆసిఫ్‌పాషా పాల్గొన్నారు.

కంది రవీందర్‌కు బెస్ట్ టీచర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కంది రవీందర్‌రెడ్డి

గోదావరిఖనిటౌన్: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్రభారతిలో జయంతి ఉత్సవాలు నిర్వహించారు. కాగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాక్టర్ కలామ్స్ స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డును స్థానిక గీతాంజలి పాఠశాల కరస్పాండెంట్ కంది రవీంర్‌రెడ్డి అందుకున్నారు.

బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్న మహేందర్



అవార్డు అందుకుంటున్న మహేందర్

ధర్మారం: మండల కేంద్రానికి చెందిన స్మార్ట్ కిడ్ పాఠశాల కరస్పాండెంట్ బుదారపు మహేందర్ నాసా సైంటిస్టు సతీశ్‌రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర బెస్టు టీచర్‌గా అవార్డు అందుకున్నారు. అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో ఈ అవార్డు అందుకున్నట్లు మహేందర్ తెలిపారు.

బీసీలంతా స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొనాలి

పెద్దపల్లిరూరల్: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు సాధించేదాకా ఐక్య పోరాటాలు చేసేందుకు బీసీలంతా సన్నద్ధం కావాలని బీసీ సంఘాల నాయకులు అన్నారు. పెద్దపల్లిలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 18న ఇచ్చిన బంద్ పిలుపులో బీసీలంతా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతమయ్యేలా చూడాలన్నారు. నాయకులు శ్రీమాన్, శంకర్, రాజగోపాల్, సదానందం, అశోక్, రాజ్‌కుమార్, అయిలయ్య, సదాశివ్, రవి, పరమేశ్వర్, రామ్మూర్తి, శివ, సతీశ్, సురేశ్, అంజి, లక్ష్మయ్య, రమేశ్, నవీన్, కొమురయ్య ఉన్నారు.

అయ్యప్ప ఆలయంలో గోపూజ

ధర్మారం: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం గోపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తాటిపెల్లి ఈశ్వర్, పూజారి బీవీ నర్సింగరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

పెద్దపల్లి: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని అనుష్క రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికై నట్లు స్పోర్ట్స్, గేమ్స్ ఇన్‌చార్జి సునీల్ తెలిపారు. విద్యార్థిని ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు బుధవారం అభినందించారు. మంగళవారం కరీంనగర్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 వాలీబాల పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అధ్యాపకులు మాధవిలత, దేవేందర్, ప్రభాకర్, విక్రమ్, అర్జున్, హరికృష్ణ ఉన్నారు.



జూలపల్లి: మండల కేంద్రం నుంచి పెద్దాపూర్ వెళ్లే దారిలో రోడ్డు మలుపు ప్రమాదకరంగా మారింది. గతంలో ఇక్కడ ప్రమాదాలు జరగగా, కొన్ని రోజులు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేశారు. ప్రస్తుతం హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు వాపోతున్నారు. రోడ్డు మలుపు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

దీపావళి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



మాట్లాడుతున్న జీఎం లలిత్‌కుమార్

గోదావరిఖని: దీపావళి ఉత్సవాలు 19న స్థానిక జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ పేర్కొన్నారు. జీఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సినీ నటులు, మిమిక్రీ స్టార్ శివారెడ్డి, సినీనటుడు అలీ, గాయని గీతామాధురి, జబర్దస్త్ బుల్లెట్ భాస్కర్ టీం, గోవిందా డ్యాన్స్ గ్రూప్ డ్యాన్స్‌లు, వినోద కార్యక్రమాలు ఉంటాయన్నారు. రావణదహనం, పటాకుల ప్రదర్శన, పలురకాల ఫుడ్‌స్టాల్స్, ఎగ్జిబిషన్‌కు గ్రౌండ్‌లో ఏర్పాట్లు చేశామని వివరించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. అధికారులు చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్మిక కుటుంబాలు, ఎన్టీపీసీ, ఆర్‌ఎఫ్‌సీఎల్, స్థానిక ప్రజలు పెద్దసంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

కాంట్రాక్టు కార్మికులకు దీపావళి బోనస్ ఇవ్వాలి



మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

గోదావరిఖని: సింగరేణిలో అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు దీపావళి బోనస్ ఇవ్వాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోల్ ఇండియాలో పీఎల్‌ఆర్ బోనస్ పర్మినెంట్ కార్మికులకు, పీఎల్ఐ బోనస్ కాంట్రాక్టు కార్మికులకు ఇవ్వాలన్నారు. సింగరేణి యాజమాన్యం వెంటనే సర్క్యులర్ జారీ చేసి పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్టు మజ్దూర్ సంఘం నాయకులు బండారి శ్యామ్, శ్రీనివాస్‌రెడ్డి, గుండబోయిన భూమయ్య, సొల్లు శ్రీనివాస్, బియ్యాల మహేందర్, సమ్మయ్య, లక్ష్మణ్, విశ్వనాథ్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం జయంతి



మంథని: పూలమాల వేస్తున్న నాయకులు

మంథని: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి మంథనిలో బీఆర్‌ఎస్ నాయకులు నిర్వహించారు. పట్టణంలోని రాజగృహలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్, నాయకులు పుప్పాల తిరుపతి, జంజర్ల శేఖర్, వేల్పుల గట్టయ్య, ఆకుల రాజబాపు పాల్గొన్నారు.

ఖనిలో..

గోదావరిఖనిటౌన్: ప్రేమ చారిటబుల్ ట్రస్ట్, పర్ఫెక్ట్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక అడ్డగుంటపల్లిలోని శ్రీరామ విద్యానికేతన్ పాఠశాలలో ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి నిర్వహించారు. ట్రస్ట్ నిర్వాహకులు దాసరి స్వప్న మహేశ్, పాఠశాల కరస్పాండెంట్ సూర్యదేవర జ్యోతి, వెంకటేశ్వరరావు కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ నాయకులు నజీమొద్దీన్, మేకల సమ్మయ్య, యాకూబ్ ఆరిఫ్, సాగర్, విద్యార్థులు పాల్గొన్నారు.



జూలపల్లి: నివాళి అర్పిస్తున్న నాయకులు

పెద్దాపూర్‌లో..

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతి నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంకెళ్ల లక్ష్మీనర్సయ్య ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. నాయకులు యాదవ సంఘం అధ్యక్షుడు జేకేయాదవ్, కురుమపల్లి సంఘం అధ్యక్షుడు రాజన్నల ఎల్లయ్య, శేఖర్, మహేశ్, నరేశ్, రాయమల్లు, అనిల్, తొగరి నరేశ్, కల్లెపెల్లి లింగయ్య ఉన్నారు.

అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా అజయ్



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటి సీబీఎస్‌ఈ స్కూల్‌లో పీఈటీగా పనిచేస్తున్న ఎరవేన అజయ్‌కు 16 నుంచి 18 వరకు హన్మకొండలో జరిగే నేషనల్ అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్ పోటీలకు టెక్నికల్ అఫీషియల్‌గా అవకాశం దక్కిందని అథ్లెటిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి గట్టయ్య తెలిపారు. పెద్దపల్లి మండలం పెద్దకల్వలకు చెందిన అజయ్‌ను నియమించడంపై మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ మమతారెడ్డి, ప్రిన్సిపాల్ సర్బరీ ముఖర్జీ, వైస్ ప్రిన్సిపాల్ రాహుల్ హర్షం వ్యక్తం చేశారు.

మెడికల్ బోర్డు నిర్వహణపై స్పష్టత ఇవ్వాలి

గోదావరిఖని: మెడికల్ బోర్డు నిర్వహణపై సింగరేణి యాజమాన్యం వైఖరి స్పష్టం చేయాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు నెలలుగా మెడికల్ బోర్డు నిర్వహణ లేక కారుణ్య నియామకాలు ఉంటాయా? లేదా? అనే సందేహాలు కార్మికుల్లో తలెత్తుతున్నాయన్నారు. మార్చిలో నిర్వహించిన నామమాత్రపు మెడికల్ బోర్డులో 55 మందికి కేవలం ఐదుగురినే అన్‌ఫిట్ చేయడంతో కారుణ్య నియామకాలపై కార్మికుల్లో అభద్రత నెలకొందన్నారు. సమావేశంలో నాయకులు నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, పోలాడి శ్రీనివాస్, దూట శేషగిరి, చెల్పూరి సతీశ్, రోడ్డ సంపత్ తదితరులు పాల్గొన్నారు.